# పత్తి రైతు దిగాలు



ఖమ్మం ఏఎంసీలో పత్తి బస్తాలపై దిగాలుగా నిద్రపోతున్న రైతు

**ఆరుగాలం కష్టించి, ప్రకృతి వైపరీత్యాలను ఎదిరించి తీరా పంట చేతికొచ్చేసరికి పత్తి రైతు చతికిలపడడం సర్వ సాధారణమైంది. గతేడాది అనావృష్టి కారణంగా పెద్దగా సాగు చేపట్టని ఖమ్మం జిల్లా రైతులు ఈ ఏడాది కోటి ఆశలతో పత్తిని అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. అయితే తాము ఒకటి తలిస్తే.. దైవం మరొకటి తలిచింది అన్నట్లు తయారైంది పరిస్థితి. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు ప్రభుత్వం నుంచి సాయం అందక పోవడంతో అన్నదాతలను కష్టాలు వెంటాడుతున్నాయి. పత్తి సాగుకు ఖమ్మం జిల్లా పెట్టింది పేరు.. సారవంతమైన భూములు, అనుభవం కలిగిన రైతులు ఉన్నప్పటికీ కొన్నేండ్లుగా ఆశించిన ఫలితాలు పొందలేకపోతున్నారు. జిల్లాలో ఏటా దాదాపు 2 లక్షల ఎకరాలకు పైబడి పత్తి సాగు చేస్తున్న రైతులు ఈ ఏడాది సైతం ఒకవైపు దిగుబడి లేక.. మరోవైపు గిట్టుబాటు ధర రాక దిగాలు చెందుతున్నారు.**

*- ఖమ్మం, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*



ఖమ్మం ఏఎంసీకి రైతులు తీసుకొచ్చిన పత్తి బస్తాలు

గడిచిన ఏడాదికాలంగా ఖమ్మం జిల్లా రైతులను ప్రకృతి వైపరీత్యాలు పగబట్టినట్లు వెంటాడుతున్నాయి. దీంతో అన్నదాతలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోయిన యాసంగిలో సాగర్ కాల్వ నీటి విడుదల జరగకపోవడంతో జిల్లావ్యాప్తంగా యాసంగి సాగుకు బ్రేక్ పడింది. కనీసం పదిశాతం సాగు జరగలేదు. అయితే ఈ వానకాలంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ ఆశించిన మేర వర్షపాతం నమోదు కాలేదు. అయినప్పటికీ రైతులు తడిపొడి దుక్కిలోనే పత్తి విత్తనాలు నాటారు. అనేక చీడపీడల బెడద నుంచి పంటను కాపాడుకున్నప్పటికీ ఇటీవల కురిసిన భారీ వర్షాలు పత్తి పంటపై తీవ్ర ప్రభావం చూపాయి. జిల్లాలో అనేక చోట్ల పైర్లు నేలకొరిగాయి. కొన్ని మండలాల్లో ఊటలు పుట్టి పంట దెబ్బతిన్నాయి. వర్షాల అనంతరం సస్యరక్షణ చర్యలు చేపట్టినప్పటికీ ఆశించిన మేర పంట ఏపుగా పెరగకపోవడంతో ఆ ప్రభావం దిగుబడిపై స్పష్టంగా కనిపిస్తున్నది. ఏటా వానకాలంలో మూడు, నాలుగుసార్లు పత్తి తీతలు తీస్తే ఎకరానికి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉండేది. అయితే ఈ సంవత్సరం రెండుతీతలకు మించి పంట రాదని, ఎకరానికి అతికష్టంపై ఐదు క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. పెట్టుబడి కూడా తీరడం కష్టంగానే ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఖమ్మం జిల్లాలో..**

| | |
|---|---|
| పత్తిసాగు విస్తీర్ణం | 1,99,000 ఎకరాలు |
| దిగుబడి అంచనా | 1,80,000 మెట్రిక్ టన్నులు |
| ప్రైవేట్‌లో క్వింటాల్ గరిష్ఠ ధర | రూ.7,000 |
| సీసీఐ మద్దతు ధర క్వింటాల్ | రూ.7,520 |

### కొరవడిన సర్కార్ సహాయం..

గత పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సీజన్ ప్రారంభమయ్యిందంటే చాలు సర్కార్ సాయం కార్యక్రమాలు ఎంతో చురుగ్గా జరిగేవి. సీజన్‌కు ముందుగానే సాగు ప్రణాళిక సిద్ధం చేయడంతోపాటు అందుకనుగుణంగా విత్తనాలు, ఎరువులను సొసైటీలకు తరలించడం జరిగేది. ఏ ఒక్క రైతుకు విత్తన, ఎరువుల కొరత లేకుండా పదేండ్లపాటు విజయవంతంగా అమలు జరిగింది. పంటల పెట్టుబడి(రైతుబంధు) నిధులు సైతం తీరా సాగుకు శ్రీకారం చుట్టే సమయంలోనే 2018 నుంచి విధిగా నేరుగా రైతుల అకౌంట్లో జమకావడం, పంట చేతికొచ్చే సమయంలోగానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యేవి. కానీ.. కాంగ్రెస్ సర్కార్‌లో అటువంటి పరిస్థితి కనిపించడం లేదు. పంటల పెట్టుబడికి ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ నాయకులు ఇంతవరకు అతీగతీ లేదు. తీరా పంట మార్కెట్‌కు సైతం వస్తున్నప్పటికీ ఆ ఊసే లేకుండా పోయింది. రైతు రుణమాఫీ తీరు సైతం అనేక విమర్శలకు తావిస్తున్నది. రూ.2 లక్షల లోపు రైతులకు సైతం పూర్తిస్థాయిలో అమలుకాలేదు. దీంతో సర్కార్ నుంచి ఏమాత్రం సాయం లేకపోవడంతో రైతులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- **ఈ ఏడాది ఆశించిన దిగుబడి రాక కుదేలు**
- **వెంటాడుతున్న ప్రకృతి వైపరీత్యాలు**
- **కొరవడిన సర్కార్ సాయం**
- **కానరాని సీసీఐ కొనుగోలు కేంద్రాలు**
- **పంటను 'ప్రైవేట్'కు తెగనమ్ముకుంటున్న రైతులు**

### కానరాని సీసీఐ కేంద్రాలు..

ఈ ఏడాది జిల్లాలోని ఆయా మార్కెట్ల పరిధిలో ఉన్న తొమ్మిది జిన్నింగ్ మిల్లులను సీసీఐ కేంద్రాలుగా గుర్తించారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ క్రయవిక్రయాలకు మాత్రం నోచుకోవడం లేదు. పదిహేనురోజుల నుంచి ఖమ్మం మార్కెట్‌కు రోజుకు 5 వేల పత్తి బస్తాలను రైతులు తీసుకొస్తున్నారు. మార్కెట్‌లో గరిష్ఠ ధర క్వింటాల్ రూ.7 వేలు పలుకుతున్నప్పటికీ ఆ ధర ఒకరిద్దరు రైతులకే పరిమితమవుతున్నది. మిగిలిన రైతులకు క్వింటాల్ రూ.6 వేల నుంచి రూ.6,500 వరకు మాత్రమే పలుకుతున్నది. భారత పత్తి సంస్థ(సీసీఐ) కొనుగోళ్లు చేపట్టకపోవడం కాదు కదా కనీసం కేంద్రాల ఊసేలేకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు తమకు నచ్చిన రీతిలో ధర పెడుతుంటే ఇష్టం లేకున్నా రైతులు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరో పక్షంరోజుల వరకు సీసీఐ కేంద్రాలు ఏర్పాటయ్యే అవకాశం లేదని జిన్నింగ్ మిల్లుల యజమానులు చెబుతున్నారు. దీంతో ఈ ఏడాది రైతుల పేరుతో వ్యాపారులు సీసీఐ కేంద్రాలకు పంటను తరలించే అవకాశం వందకు వందశాతం ఉందనే చర్చ కొనసాగుతున్నది. తేమ శాతం లేదని కాలయాపన చేస్తున్న సీసీఐ అధికారులు చివరికి వ్యాపారుల వద్దనే కొంటారని వారు బహిరంగంగానే చర్చించుకోవడం విశేషం. ఏదేమైనా సకాలంలో సీసీఐ కేంద్రాలు ప్రారంభమైతే తప్ప పత్తి రైతులు మద్దతు ధర పొందడం అసాధ్యం.



మార్కెట్లో కొనసాగుతున్న క్రయవిక్రయాలు

### సీసీఐ కేంద్రాల ఊసేలేదు..



మార్కెట్‌కు పంటను తీసుకొస్తే ఏడ్చుకుంటూ తేవడం, తిరిగి ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్లడం జరుగుతున్నది. మద్దతు ధర ఇస్తాం అని ఇంతకాలం చెప్పారు. కానీ.. ఇంతవరకు సీసీఐ కేంద్రాలే ప్రారంభం కాలేదు. రైతుల నుంచి పంట అయిపోయిన తర్వాత పంటను కొన్నట్లు చేస్తారు.. కానీ.. అది రైతుల పంట కాదు. వ్యాపారుల వద్ద రైతుల పేరుతో ప్రతి ఏటా కొంటున్నారు. రైతు భరోసా లేదు.. రుణమాఫీ లేదు.

**– మద్దినేని వెంకటేశ్వర్లు, రైతు, నాగిలిగొండ, చింతకాని మండలం**

### నిబంధనలు లేకుండా కొనాలి..



సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసి పంటను వెంటనే కొనుగోలు చేయాలి. నిబంధనలు లేకుండా పంటను కొంటేనే రైతులకు న్యాయం జరుగుతుంది. ఇప్పుడు మార్కెట్ నిండా కొత్త పత్తి పంట కనపడుతున్నది. కానీ.. సీసీఐ కేంద్రాలు మాత్రం కనపబడడం లేదు. ఒకవైపు వానలు బాగా కొడుతున్నాయి. మరోవైపు కొద్దిరోజుల్లో చలి వస్తుంది. ఇట్లాంటి పరిస్థితిలో తేమ శాతం 12లోపు ఎలా ఉంటుంది. అధికారులు ఆలోచన చేసి నిబంధనలు లేకుండా కొంటేనే పత్తి రైతులకు న్యాయం జరుగుతుంది.

**–రావూరి కృష్ణారావు, రైతు, మునిగపల్లి, కూసుమంచి మండలం**

# అడ్రస్ లేని సీసీఐ

- **భద్రాద్రి జిల్లాలో 2,01,216 ఎకరాల్లో పత్తిసాగు**
- **దళారులపాలవుతున్న పంట**
- **నష్టపోతున్న రైతన్నలు**



దళారులు కొనుగోలు చేస్తున్న పత్తి (ఫైల్)

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ) : పత్తి రైతులకు కష్టాలు వచ్చిపడ్డాయి. ఒకవైపు వానలు దంచికొట్టడం.. మరోవైపు తెగుళ్లు ఆశించడంతో పత్తి దిగుబడి తగ్గుతున్నదని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు దళారుల బెడద ప్రతి ఏటా వెంటాడుతూనే ఉంది. దసరా తర్వాత కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్న సీసీఐ నేటికీ కేంద్రాలను ప్రారంభించలేదు. ఏటా లక్షల మెట్రిక్ టన్నులు పత్తి దిగుబడి అవుతుండగా.. అందులో కేవలం సీసీఐ ప్రతి ఏటా 5 నుంచి 6 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని మాత్రమే కొనుగోలు చేయాల్సి వస్తుంది. దీంతో పత్తి పంట దళారులపాలవుతున్నది.

### దోచుకుంటున్న దళారులు

వానలు దంచినా, అసలు సాగునీరు లేకున్నా రైతన్నలు నానా ఇబ్బందులు పడి పండిస్తున్న పత్తి పంటపై ఏటా దళారులు మాటు వేసి రైతన్నల కష్టాన్ని దోచుకుంటున్నారు. ఏకంగా ఇంటికి వెళ్లి మరీ పత్తిని కొనుగోలు చేయడంతో రైతులు ఏటా తీవ్రంగా నష్టపోతున్నారు. ఏటా భద్రాద్రి జిల్లాలో 2 లక్షల ఎకరాలకు పైగా పత్తిని సాగు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా 2,01,216 ఎకరాల్లో పంటను సాగు చేయగా.. 16 లక్షలకు పైగా దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. దీంతో ఇప్పటి నుంచే దళారులు పత్తిని కొనుగోలు చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

### పత్తి ఇంకా రాలేదు..



ఈ ఏడాది గతేడాది కంటే కొంచెం పత్తి సాగు చేశారు. అంచనాలకు మించి పత్తి సాగు అయ్యింది. సీసీఐ నాలుగు చోట్ల కేంద్రాలను అందుబాటులో ఉంచింది. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు. ప్రభుత్వం గిట్టుబాటు ధర రూ.7,521 ప్రకటించింది. రైతులు సీసీఐ కేంద్రాల్లోనే విక్రయాలు చేసుకోవాలి.

**– నరేందర్, జిల్లా మార్కెటింగ్ అధికారి, భద్రాద్రి కొత్తగూడెం**

# మహోన్నత వ్యక్తి వాల్మీకి

- **భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్**
- **కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతి వేడుకలు**



వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ) : ప్రపంచం ఉన్నంత వరకు ఆదికవి వాల్మీకి మహర్షి రాసిన రామాయణం, ఆయన చరిత్ర ఉంటుందని, మహోన్నత వ్యక్తి వాల్మీకి స్ఫూర్తితోనే అనేక మంది కవులు, రచయితలుగా మారారని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయణాన్ని రచించింది బోయ కులానికి చెందిన వాల్మీకి అని, ఆయన సాహిత్యం, ఇతిహాసాల్లోని సారాంశాలను ఈ తరం పిల్లలకు అర్థమయ్యే విధంగా తెలియజేసే బాధ్యత మరందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఇందిర, కలెక్టరేట్ ఏవో రమాదేవి, బీసీ సంఘం నాయకులు మురికి వెంకన్న, బోగా నందకిషోర్, ఉలవల రాములు, గట్టేశం తదితరులు పాల్గొన్నారు.

# విలువలు బోధించిన 'మహర్షి'

**వాల్మీకి జయంతి వేడుకల్లో ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీజ**



వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

మామిళ్లగూడెం, అక్టోబర్ 17 : రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి ఆదర్శ మానవుడికి ఉండాల్సిన లక్షణాలు, మానవ సంబంధాలు, విలువలను బోధించారని, ఆయన చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఖమ్మం అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మహర్షి వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అదనపు కలెక్టర్.. వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహర్షి వాల్మీకి రామాయణ గ్రంథాన్ని రచించి అనేక విలువలను సమాజానికి అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో డీఆర్వో రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ, బీసీ సంఘం నాయకులు వెంకటరమణ, షకీనా, వాల్మీకి సంఘం నాయకులు ఉపేందర్‌రావు, శ్రీనివాసరావు, నర్సింహారావు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు వెంకటరామయ్య, వరప్రసాద్, పుల్లారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# భక్త శబరి స్మరణలో...



స్వామివారికి పూలు, పండ్లు తీసుకువస్తున్న గిరిజనులు, ఆలయ అధికారులు



రామాలయ మాడవీధుల్లో శబరి స్మృతియాత్ర

- **అపర భక్తురాలికి ఫల, పుష్పాలతో ప్రత్యేక పూజలు**
- **అశ్వారావుపేట మండలం వినాయకపురంలో స్మృతియాత్ర**
- **భద్రాద్రి రామాలయ మాడవీధుల్లో ఉత్సవమూర్తుల ఊరేగింపు**

భద్రాచలం, అక్టోబర్ 17 : భద్రగిరి క్షేత్రంలో రామయ్యకు అపర భక్తురాలైన శబరి స్మృతియాత్రను గిరిజనుల సమక్షంలో గురువారం వైభవోపేతంగా నిర్వహించారు. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఏటా ఆశ్వయుజ పౌర్ణమి రోజు శబరి స్మృతియాత్ర నిర్వహించడం ఆనవాయితీ. అయితే ఈ ఏడాది గిరిజన గ్రామమైన అశ్వారావుపేట మండలం వినాయకపురంలో ఉత్సవం నిర్వహించాలని రామాలయ ఈవో రమాదేవి నిర్ణయించడంతో అక్కడ గిరిజన మహిళల కోలాటాలు, కొమ్ము నృత్యాలు, గిరిజన సాంప్రదాయం ప్రకారం శబరి స్మృతి యాత్రను కనుల పండువగా నిర్వహించారు. భద్రాద్రి రామాలయానికి గిరిజనులు సంప్రదాయం ప్రకారం పండ్లు, పూలు తీసుకొచ్చి అర్చకుల వేదమంత్రాల నడుమ వాటిని స్వామి వారికి సమర్పించారు. అనంతరం చప్టా దిగువనున్న తూము నర్సింహదాసు, భక్తరామదాసు విగ్రహాలకు అర్చకులు ప్రత్యేక పూజలు చేసి హారతులిచ్చారు. శబరి మాత విగ్రహానికి కూడా పూలు, పండ్లు, వస్త్రాలను సమర్పించారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారి ఉత్సవ విగ్రహాలు, శబరి విగ్రహానికి గిరిజనులు పలు రకాల పూలు, పండ్లు సమర్పించగా.. అర్చకులు స్వామివారి నిత్య కల్యాణం జరిపించారు. అనంతరం గిరిజన పెద్దలను ఆలయ అర్చకులు సత్కరించారు. తొలుత శబరి స్మృతియాత్రలో భాగంగా రామాలయ మాడవీధుల్లో ఉత్సవమూర్తులను ఘనంగా ఊరేగించారు. యాత్రను భక్తులు తిలకించి పరవశించిపోయారు. శబరి స్మృతి యాత్రలో భాగంగా కూనవరం-వీఆర్ పురం గ్రామాల మధ్య శబరి నదికి అర్చకులు పూజలు చేసి అక్కడే ఉన్న శబరి విగ్రహానికి నదీ జలంతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, గిరిజన పెద్దలు పాల్గొన్నారు.

# గిరిజనుల ఆరాధ్యుడు కుమ్రంభీం

**భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్**



కుమ్రం భీం చిత్రపటానికి పూలమాల వేస్తున్న పీవో రాహుల్

భద్రాచలం, అక్టోబర్ 17 : గిరిజనుల హక్కుల సాధన కోసం జల్ జంగిల్ జమీన్ నినాదంతో నిజాం సర్కార్‌తో పోరాడి అసువులుబాసిన విప్లవయోధుడు, గిరిజనుల ఆరాధ్య దైవం కుమ్రంభీం అని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరిజనుల ముద్దుబిడ్డ కుమ్రంభీం 84వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పీవో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ అడవి బిడ్డల హక్కుల సాధన కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు కుమ్రం భీం అని కొనియాడారు.

**వాల్మీకి జయంతి వేడుకల్లో..**

ఆదికవి వాల్మీకి జయంతి వేడుకలను ఐటీడీఏ సమావేశ మందిరంలో పీవో రాహుల్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటానికి పీవో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాద్రి రాముడు నడయాడిన ప్రదేశంలో పనిచేస్తున్న మనం.. ఆయన చరిత్రను రామాయణంగా మలిచిన వాల్మీకి జయంతిని జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఏవో రాంబాబు, ఉద్యానవన అధికారి ఉదయ్‌కుమార్, అగ్రికల్చర్ ఏడీ భాస్కర్, ఆర్‌సీవో గురుకులం నాగార్జునరావు, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, డీటీఆర్‌వోఎఫ్‌ఆర్ లక్ష్మీనారాయణ, పీవీజీటీ అధికారి మణిధర్, ఏసీఎంవో రమణయ్య, జీసీడీవో అలివేలు, మంగతాయారు, డీఎస్‌వో ప్రభాకర్‌రావు, జేడీఎం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి కిన్నెరసానిలో క్రీడాపోటీలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీడీ మణెమ్మ

పాల్వంచ రూరల్, అక్టోబర్ 17: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన పాఠశాలల స్థాయి క్రీడాపోటీలు శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్‌లో జరగనున్నాయి. ఏర్పాట్లను డిప్యూటీ డైరెక్టర్(డీడీ) మణెమ్మ గురువారం పరిశీలించారు. వ్యాయామ ఉపాధ్యాయులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. క్రీడాపోటీలను విజయవంతం చేయడంపై చర్చించారు. బాలికలకు 18న, బాలురకు 19న పోటీలు నిర్వహించాలన్నారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, ఆర్చరీ, అథ్లెటిక్స్, చెస్ తదితర క్రీడాంశాల్లో జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించాలన్నారు. స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాల్‌రావు, దమ్మపేట ఏటీడీవో చంద్రమోహన్, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటనారాయణ, నాగేశ్వరరావు, రాంబాబు, నెహ్రూ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## డీఈవోను తొలగించాలని ఉపాధ్యాయుల ధర్నా

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబర్ 17: డీఎస్సీ-2024 ఉపాధ్యాయుల కౌన్సిలింగ్‌లో అక్రమాలకు పాల్పడిన డీఈవో వెంకటేశ్వరాచారిని తక్షణమే విధుల నుంచి తొలగించాలన్న డిమాండుతో యూటీఎఫ్ నాయకులు గురువారం డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. యూపీఎస్ సీతాయిగూడెం ఎస్‌ఏ (సోషల్) పోస్టింగ్ రద్దు చేయాలని, డీఈవో కార్యాలయ ఏపీవో కిరణ్‌ను విధుల నుంచి తొలగించాలని, రెగ్యులర్ పోస్టుల్లో నియమితులైన ఎస్‌ఏ తెలుగు, హిందీ అభ్యర్థులను వారికి కేటాయించిన పోస్టుల్లోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా, ఒక సంఘానికి అనుకూలంగా ఇచ్చిన పోస్టింగులను నిలిపివేసేంత వరకు తమ ఆందోళనను కొనసాగిస్తామని హెచ్చరించారు. కిషోర్‌సింగ్, కృష్ణ, ఎస్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


